108)ముఖారి

ప|| ఏలోకమందున్నా నేమీ లేదు | తాలిమి నందుకుదగ్గదావతేకాని ||

చ|| సురల కసురలకు సూడునుబాడునే కాని | పొరసి సుఖించగ బొద్దు లేదు |
ధరలో ఋషులకును తపము సేయనేకాని | మరిగి భోగించగ మరి పొద్దు లేదు ||

చ|| గక్కన సిద్ధులకైనా గంతయు బొంతయేకాని | చిక్కి పరుసము గలిగి నెలవులేదు |
రెక్కలు గలపక్షికి రేసుతిమ్మటలేకాని | చక్క వైకుంఠాన కెగయ సత్తువ లేదు ||

చ|| సకల జంతువులకు జన్మాదులేకాని | అకటా నిత్యానంద మందలేదు |
వెకలి శ్రీవేంకటేశు విష్ణుదాసులకే మంచి- | సుకములెల్లా గలవు సుడివడలేదు ||